క్లుప్తంగా

నేత్ర పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంఈఓ పాపినాయుడు



నేత్ర పరీక్షలు చేయించుకున్న విద్యార్థినులతో ఆరోగ్య సిబ్బంది

పూసపాటిరేగ: నేత్ర పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బి. పాపినాయుడు అన్నారు. సోమవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 185 మంది విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. కళ్లద్దాలు అవసరమున్నవారికి ఉచితంగా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భారతి, ఆరోగ్య సహాయకుడు ఆర్వీ రమణ, స్వామి కంటి ఆస్పత్రి పీఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లేత వరి నారుతో అధిక దిగుబడి



యంత్రంతో జరుగుతున్న వరి ఉబాలను పరిశీలిస్తున్న ఏఓ నిర్మల, తదితరులు

డెంకాడ: లేత వరినారుతో (15 నుంచి 25 రోజులు) ఉబాలు చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి పి.నిర్మల అన్నారు. మండల కేంద్రంలో కొయనేని రమణ పొలంలో ఎంటీయూ 1121 రకం 19 రోజులున్న వరి నారును యంత్రంతో ఉబాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యంత్రాలతో ఉబాలు చేయడం వల్ల క్రమపద్ధతిలో నాట్లు పడతాయని తెలిపారు. దీనివల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడపీడల బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆకస్మిక పర్యటన



49వ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ ఎం ఎం నాయుడు

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న కాలువల్లో పూడికతీత పనులను కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు సోమవారం పరిశీలించారు. వీటీ అగ్రహారం, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో పర్యటించి చెత్త తొలగింపు కార్యక్రమాన్ని గమనించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా నగరంలోని 49వ నంబర్ సచివాలయాన్ని పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.


ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి తొమ్మిది వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతి పత్రాలను కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ అమ్మాజీరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రామకృష్ణ

పూసపాటిరేగ : భోగాపురం రూరల్ సీఐగా డి. రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి. వెంకటేశ్వరరావుకు విశాఖ రేంజ్‌కు బదిలీ జరగడంతో ఆయన స్థానంలో రామకృష్ణ వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు కళాశాలల్లో ర్యాగింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ కేసులును త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఆయనతో పాటు ఎస్సై ఎ. సన్యాసినాయుడు ఉన్నారు.

వానాకాలం.. జరభద్రం..

● పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
● వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమే
● జాగ్రత్తలు పాటించాలంటున్న కార్పొరేషన్ అధికారులు

ప్రాంతం	:	విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్
మొత్తం డివిజన్‌లు	:	50
నివసించే జనభా	:	3 లక్షలకు పైగానే



నగరంలోని బొండాడవీధిలో నిల్వ నీటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు (ఫైల్)

విజయనగరం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కొరవడడం వంటి కారణాలతో వ్యాధులు విస్తరిస్తున్నాయి. అంటువ్యాధులను నియంత్రించాలంటే పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గడిచిన పక్షం రోజుల్లో నాలుగు డెంగీ కేసులు వెలుగులోకి రాగా... వేలాది మంది వివిధ రకాల వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలే తగిన జాగ్రత్తలు పాటించాలని అటు కార్పొరేషన్ అధికారులతో పాటు ఇటు వైద్యులు చెబుతున్నారు.

కీటక జనిత వ్యాధులు..

వర్షాకాలంలో ప్రధానంగా కీటక జనిత వ్యాధులు ప్రబలుతుంటాయి. మరికొన్ని అపరిశుభ్రత, కలుషిత ఆహారం వల్ల సోకుతాయి. ఈ వ్యాధులే అధిక శాతం మందిని సతమతం చేస్తుంటాయి. దీంతో ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. ప్రస్తుతం విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రతి ఆస్పత్రిలో రోజుకు 100 నుంచి 150 మంది వరకు జ్వరపీడుతులు వైద్యం కోసం వస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడమే వ్యాధుల వ్యాప్తికి కారణమని వైద్యులు చెబుతున్నారు.

అవగాహన కల్పించాలి..

అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో సరైన చర్యలు తీసుకుంటే కాలానుగుణ వ్యాధులను నివారించవచ్చు. ప్రజల్లో నెలకొన్న అవగాహనారాహిత్యాన్ని కూడా తొలగించారు. ఇప్పటికే నగరంలో డ్రైడే వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయి. అదే విధంగా ప్రజలకు సురక్షిత నీరందించడానికి ఎప్పటికప్పుడు నీటి లీకేజీలు అరికడుతూ సాగాలి. వీటిపై కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

● వేపుళ్లు, అధిక నూనె వస్తువులు తగ్గించాలి.
● సురక్షిత నీటినే తాగడానికి, వంటకు ఉపయోగించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
● కూరగాయలు, పండ్లు తినేముందు శుభ్రంగా కడగాలి.
● ఆహార పదార్థాలపై కీటకాలు వాలకుండా ఏదైనా మూత పెట్టాలి.
● సరిపడా నీరు తాగాలి.
● ఆరుబయట ఆహారం తినకూడదు.
● ఎప్పటికప్పుడు వండుకుని వేడి వేడి ఆహారం తీసుకోవడం మేలు.
● చేతులు శుభ్రంగా కడుక్కోవాలి
● రద్దీ ప్రాంతాలకు వెళ్లడం తగ్గించాలి.
● వ్యక్తిగత శుభ్రత తప్పకుండా పాటించాలి
● బయటకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలి.
● అంటువ్యాధులు సోకిన వారికి కాస్త దూరంగా ఉండాలి.
● కళ్లు, ముక్కు, నోటిని కడగని చేతులతో తాకొద్దు.
● వర్షంలో వెళ్లేటప్పుడు రెయిన్ కోట్, గొడుగు వేసుకోవాలి.
● దోమల నుంచి రక్షణకు చేతులు, కాళ్లు కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి.

వానాకాలం సన్నద్ధత..

● దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.
● కొబ్బరి బోండాలు, ఖాళీ డబ్బాలు, కూలర్లు, ఇతర నిరుపయోగ వస్తువుల్లో నిల్వ నీటిని పారవేయాలి.
● ఇంట్లోకి సరైన గాలి, వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి.
● ఇంటికి సమీపంలో గుంతలు, డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా స్థానిక సంస్థల యంత్రాంగంతో కలిసి పనిచేయాలి.
● ఇంట్లో బూజు దులిపి ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి.
● ప్రభుత్వ యంత్రాంగం సూచనలను పాటిస్తూ శుభ్రతకు కృషి చేయాలి.
● ఇంటి పరిసరాల్లో ఎక్కడా కూడా నీరు నిల్వకుండా చూసుకోవాలి.
● రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవడం మంచిది.

జాగ్రత్తలు పాటించాలి..

ప్రస్తుత సీజనల్ కాలంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల నియంత్రణ సాధ్యపడుతుంది. దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయాలపై నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు కూడా అవగాహన పెంపొందించుకుని వ్యాధులు బారిన పడకుండా తమను తాము రక్షించుకోవాలి.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్


తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవంలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సర్పంచ్ గాయత్రి

పూసపాటిరేగ: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని నడిపల్లి సర్పంచ్ లంకలపల్లి గాయత్రి అన్నారు. మండలంలోని నడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లపాల వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని సూచించారు. ప్రతి తల్లి కూడా బిడ్డకు పాలివ్వడం ప్రకృతి ధర్మమని, మిగతా ఏ విధమైన పోషకాహారం తల్లిపాలకు సాటిరావని చెప్పారు. తల్లిపాలలో సహజ సిద్ధమైన వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. అలాగే తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ రాదని తెలిపారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్త ఎస్.అనిత, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ భారతీయ తత్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదిలక్ష్మి అమ్మవారికి సోమవారం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు చామర్తి రమేష్ ఆచార్యులు వేదమంత్రాల నడుమ దేవాలయం ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవీ దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్కులో తుప్పల తొలగింపు



జేసీబీ సహాయంతో తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో గల అయ్యప్పనగర్ పార్కుకు మోక్షం లభించింది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తుప్పలు దట్టంగా పెరగడంతో పందులు, పాములకు ఆవాసంగా మారాయి. దీంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయాన్ని కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు దృష్టికి తీసుకురాగా... స్పందించిన కమిషనర్ 48 గంటల వ్యవధిలో పార్కు పరిసరాలను జేసీబీ సహాయంతో శుభ్రం చేయించారు. స్థానికంగా ఉన్న కుక్కలను పట్టుకుని వేరేచోటుకు తరలించారు. ఆ ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రామనారాయణంలో శ్రావణమాస పూజలు



రామనారాయణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు నీరజవల్లి



శ్రావణ పూజలకు సిద్ధమైన పైడితల్లి

విజయనగరం టౌన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం కలశస్థాపన, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అర్చకులు చాణక్య, హర్ష, తేజ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నీరజవల్లి పూజల్లో పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయంలో..

సిరుల తల్లి పైడితల్లి అమ్మవారు శ్రావణమాస పూజలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం వేకువజాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడి వద్ద మంగళవారం నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు.

మోదీ హయాంలో దేశం విచ్ఛిన్నం



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విజయనగరం పూల్‌బాగ్: ప్రధాని మోదీ హయాంలో దేశం అన్నివిధాలా విచ్ఛిన్నమైందని, ఆయన్ను కొనసాగిస్తే మరింత ముప్పు తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య అన్నారు. సోమవారం స్థానిక అమర్‌భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని బడా వ్యాపారుల చేతుల్లో పెట్టి మోదీ ప్రభుత్వం వారికి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. బడాబాబులు చేసిన రూ.16 లక్షల కోట్ల అప్పులను మోదీ రద్దు చేశారని చెప్పారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లోనే పోగుపడిందని, వాటిని పేదలకు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, జిల్లా సహాయకార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా నాయకులు ఎస్. రంగరాజు, రమణమ్మ, అప్పన్న, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు సహకారం



సాహసం ట్రస్టు దత్తత తీసుకున్న విద్యార్థినికి హామీపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు ఉన్నత పాఠశాలలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన సాహసం ట్రస్టు సహకారం అందజేసింది. రూ.1.50 లక్షలతో మూడు కంప్యూటర్లు, కంప్యూటర్ టేబుళ్లు, పుస్తకాలు, పుస్తకాల ర్యాక్‌లు కొనుగోలు చేసి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా పాఠశాలకు సోమవారం అందజేశారు. సాహసం ట్రస్టు వ్యవస్థాపకుడు మాచారపు గణేష్‌ను అభినందించారు. అనంతరం పాఠశాలలో ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.అలాగే గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని జొన్నాడ మంగ, నర్సింగ్ విద్యార్థిని కొయ్యనేని ఉషను ట్రస్టు దత్తత తీసుకున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు గణేష్ తెలిపారు. వీరి చదువులకు అవసరమైన ఖర్చుతో పాటు ఉద్యోగంలో స్థిరపడే వరకు పూర్తి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈమేరకు హామీ పత్రాలను విద్యార్థులకు అందజేశారు. విశ్రాంత ఎంఈఓలు సీహెచ్. కూర్మారావు, శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు కొల్లి రమణ మూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ పూడి హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు రామతీర్థం, దేవుని నెలివాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

9న మండల సర్వసభ్య సమావేశం

భోగాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

నైట్ డ్యూటీలు సర్వీస్ రూల్స్‌కు విరుద్ధం



కొత్తవలస: ఆర్‌ఐ రాజేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

వేపాడ/కొత్తవలస: సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా తమతో రాత్రిపూట తహసీల్దార్ కార్యాలయాల వద్ద డ్యూటీలు చేయించడం వెంటనే విరమించాలని, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీఓను రద్దు చేయాలని వీఆర్‌ఏలు కోరారు. వేపాడలో తహసీల్దార్ సన్యాసినాయుడుకు, కొత్తవలసలో ఆర్‌ఐ రాజేష్‌కు ఆయా మండలాల వీఆర్‌ఏలు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని, అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇప్పించాలని, పేస్కేల్ అమలుచేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని, ఖాళీగా ఉన్న అటెండర్,వాచ్‌మన్,రికార్డు సహాయకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కొట్టాంలో వైద్య శిబిరం



శృంగవరపుకోట: వైద్యశిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న జడ్జి వాణి, తదితరులు



గజపతినగరం:శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ ప్రవర్ధన్

శృంగవరపుకోట: కొట్టాం పీహెచ్‌సీలో వైద్యాధికారి జె.హారిక ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సాధికార సంస్థ చైర్‌పర్సన్ సబ్బవరపు వాణి ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ బడుగులు, బలహీనులు, పేదలకు ఆరోగ్యం అందివ్వడం సమాజం బాధ్యతని. అందుకు అన్ని వర్గాల్లో, స్థాయిల్లో ఉన్న వాళ్లంతా తగిన సహాయం అందించాలని అన్నారు. శిబిరంలో పలుగ్రామాల నుంచి వచ్చి ప్రజలతో పాటు న్యాయ వాదులకు అందించిన వైద్య సేవలను పరిశీలించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మందులు, వేర్వేరు విభాగాలను పరిశీలించి, పీహెచ్‌సీ ద్వారా గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: లయన్స్ క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్, డాక్టర్ బి.ఎస్.ఆర్.మూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బెల్లాన లక్ష్మినరేన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం సాధారణ, నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యుడు ప్రవర్ధన్, తదితరులు 40మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే విజయనగరం ప్రేమసమాజంలో 120 మందికి భోజనాలు అందజేసి, దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పి.టి.కుమార్, బాబి, గేదెల జగదీశ్వరరావు, బోని శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకుడు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించండి

● ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు



బొండపల్లి: మట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు



జామి: కరపత్రాలను విడుదలచేస్తున్న ఎంపీడీఓ తిరుమలరావు,ఎంఈఓ జయశ్రీ

బొండపల్లి: సార్వత్రిక విద్యావిధానంలో(ఓపెన్ స్కూల్) పదో తరగతితో పాటు ఇంటర్ చదువుకోవాలనుకునే ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మండల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, సచివా లయ కార్యదర్శులు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యా శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు నిండి రాయడం, చదవడం వచ్చే వారు ఓపెన్ టెన్త్‌కు, 15 ఏళ్లు నిండి ఇంటర్ ఫెయిల్ అయిన వారు, మధ్యలో చదువుమానేసిన వారు, పదోతరగతి పూర్తి చేసిన వారు ఓపెన్ ఇంటర్ చదివేందుకు అర్హులని చెప్పారు. ఈనెల 27వ తేదీలోగా రూ.200 ఫీజును గ్రామ, వార్డు సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో కానీ, గొట్లాం ఉన్నత పాఠశాలలో కాని చెల్లించి వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని చెప్పారు. ఎంఈఓలు కె.శోభారాణి, ఏ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి

జామి: ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యపై గ్రామాల్లో అవగాహన కల్పించి, అర్హులు అడ్మిషన్‌లు పొందేలా చూడాలని ఎంపీడీఓ తిరుమలరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ జయశ్రీ ఆధ్వర్యంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సోమవారం సమావేశమయ్యారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ చదవాలనుకునే అర్హులు ఈనెల 27వ తేదీలోగా ఫీజు చెల్లించి వివరాలు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు.

సేవ చేయడం అదృష్టం



దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న వై.ఎస్.ఆర్.శర్మ, శంకర్‌నారాయణ తదితరులు

కొత్తవలస: దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని ఆంధ్రప్రభ దినపత్రిక చీఫ్ ఎడిటర్ వై.ఎస్.ఆర్.శర్మ అన్నారు. మంగళపాలెం సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టులో 15 మంది దివ్యాంగులకు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కృత్రిమ అవయవాలు, బ్లైండ్ స్టిక్స్, చేతి కర్రలు అందజేశారు. ముఖ్య అతిథులుగా వై.ఎస్.ఆర్.శర్మతో పాటు హాస్యబ్రహ్మ శంకర్‌నారాయణ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు రేషన్ అందజేశారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు, వైస్ చైర్మన్ వి.ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.